పాతికేళ్లకు.. జలకళ



కళకళలాడుతున్న చెరువు

ఎక్కడ నీరుంటుందో అక్కడ అభివృద్ధి ఉంటుంది. నీరు ఉంటే బంగారు పంటలు పండుతాయి. నీరు లేకపోతే కరువు కాటకాలతో అల్లాడాల్సిన పరిస్థితులు. అందుకే మన పూర్వికులు నీటి ప్రాధాన్యాన్ని గుర్తించి, ముందుచూపుతో వ్యవహరించారు. చెరువులు, కుంటలను తవ్వించారు, ప్రాజెక్టులను నిర్మించారు. వర్షపు నీటిని మళ్లించి భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకున్నారు. ఎర్రదొడ్డి గ్రామానికి అనుకొని ఉన్న చెరువుకు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చెరువును తవ్వినప్పటి నుంచి ఒట్టిపోయింది. ఇటీవలే రైతులు ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరించారు. దీంతో వారు సమస్యను కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు టీబీపీ నీటిని గోరంట్ల మేజర్ ద్వారా మళ్లించారు. దాదాపుగా నెలరోజుల పాటు చెరువుకు నీటిని విడుదల చేయడంతో 75 శాతం నిండింది. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 75శాతం నిండిన ఎర్రదొడ్డి చెరువు
- పెరుగుతున్న భూగర్భ జలాలు
- ఆనందంలో అన్నదాతలు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గ్రామానికి అనుకొని ఓ చెరువు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వమే దీన్ని తవ్వించినట్లు తెలుస్తోంది. మొదట్లో ఈ చెరువు పంచాయతీరాజ్ విభాగం కింద ఉండేది. 2007లో చెరువును మైనర్ ఇరిగేషన్ శాఖకు బదలాయించారు. ఎర్రదొడ్డి చెరువు మొత్తం 3.06 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం వ్యాపించింది. ఈచెరువు దాదాపు 11.43 మెట్రిక్ క్యూసెక్కుల (పర్ ఫీట్) సామర్థ్యం ఉంది. అధికారుల లెక్కల ప్రకారం చెరువు ఆయకట్టు 20.3ఎకరాలు మాత్రమే. అయితే అనధికారికంగా సుమారు 200 ఎకరాలకు పైనే.

నీళ్లు అందక చాలా ఏళ్లయ్యింది



నెలక్రితం ఒట్టిపోయిన చెరువు

ఎర్రదొడ్డి చెరువుకు కాలువల ద్వారా నీళ్లు అందక చాలా ఏళ్లయ్యింది. వర్షాకాలంలో భారీ వర్షాలు వస్తే కొంతమేర జలాలు చేరేవి. పాతికేళ్లలో చెరువు ఎన్నడూ నిండలేదు. దీంతో రైతులు ఖరీఫ్ పంటపై ఆధారపడేవారు. రబీ సీజన్‌లో చాలా కుటుంబాలు వలస వెళ్లేవారు. సమీప బోరు బావులు కూడా భూగర్భజలాలు అందక అరకొరగా పారేవి. వర్షాభావ పరిస్థితుల్లో చెరువులో చుక్కనీరు ఉండేది కాదు. చెరువు ఒట్టిపోయిన సందర్భాలే అధికంగా ఎదుర్కొన్నామని స్థానిక ప్రజలు ఆవేదన చెందారు.

పూర్తిగా నింపుతాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎర్రదొడ్డి చెరువును పూర్తిస్థాయిలో నింపుతాం. ఎగువ ప్రాంతంలో రైతుల అవసరాలకు వినియోగిస్తున్నాం. వర్షం పడ్డ వెంటనే తిరిగి చెరువుకు మళ్లిస్తాం. ఇటీవల డీఈ చెరువును పరిశీలించారు.

● దుర్గాభవాని, ఏఈ, టీబీపీ

రైతుల విన్నపాలు నెరవేరిన వేళ

నెల రోజుల క్రితం రైతులు డీసీ-8 చైర్మన్ కే. చంద్రశేఖర్, డబ్ల్యూయూఏ అధ్యక్షుడు మేకల శంకర్, టీడీపీ నాయకులతో కలిసి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిలను కలిశారు. ఎన్నోఏళ్లుగా చెరువుకు నీళ్లు రావడం లేదని తమ ఇబ్బందులపై విన్నవించారు. వారు సమస్యను కలెక్టర్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు టీబీపీ నీటిని గోరంట్ల మేజర్ ద్వారా మళ్లించారు. దాదాపుగా నెలరోజుల పాటు చెరువుకు నీటిని విడుదల చేయడంతో 75 శాతం నిండింది. ఎగువ రైతుల అవసరాల అనంతరం తిరిగి చెరువుకు మళ్లించి పూర్తిగా నింపుతా మని అధికారులు అంటున్నారు.

సుమారు లక్ష చేప పిల్లలను..

ఒట్టిపోయిన చెరువుకు జలజీవం కలగడంతో రైతుల సంతోషానికి అవ ధులు లేవు. పనిలో పనిగా చెరువులో సుమారు లక్ష వరకు చేపపిల్లలను వదిలారు. చేపలను పెంచి విక్రయం ద్వారా వచ్చిన సొమ్మును గ్రామాభి వృద్ధికి వినియోగిస్తామని తెలిపారు.



సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

భూగర్భ జలాలు పెరుగుతాయి



మా పెద్దల హయాంలో చెరువు తవ్వించారని విన్నా. ఎప్పుడూ చెరువు ఒట్టిగానే ఉంది. వర్షాలు ఎక్కువగా కురిసిన ఏడాది మాత్రమే కొద్దోగొప్పో నీరు చేరేది. ఇప్పటిలా నిండుగా ఎన్నడూ చూడలేదు. బోర్లకు భూగర్భ జలాలు పెరుగుతాయి. మూగజీవాలకు నీటి సమస్య తీరింది.

● సోమన్న, రైతు, ఎర్రదొడ్డి

గర్వంగా ఉంది



ఎర్రదొడ్డి చెరువుకు నీరు విడుదల చేయించాలని కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కోరాం. వారు స్పందించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టీబీపీ నీటిని విడుదల చేయడంతో చెరువులో నీరు చేరింది. ఎన్నో ఏళ్లుగా ఒట్టిపోయిన చెరువు నీటితో కళకళలాడుతుండడం గర్వంగా ఉంది.

కే. చంద్రశేఖర్, చైర్మన్, డీసీ-8

మరో నాలుగు రోజులు వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి 18వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 15వ తేదీ 3 మి.మీ., 16 వ తేదీన 3.3., 17న 10మి.మీ., 18న 3.3 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. అలాగే పశ్చిమ దిశగా గాలులు గం టకు 10 నుంచి 12 కి.మీ. వేగంతో వీస్తాయన్నారు. ముఖ్యంగా వర్షానికి పత్తి తడిసిపోకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

- ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్
- సైకిల్ ర్యాలీ ప్రారంభం



జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ ద్వారా శారీరక ధృడత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఆదివారం సన్ డేస్ ఆన్ సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కొండారెడ్డి బురుజు నుంచి ప్రారంభమై పాత కంట్రోల్ రూం కిడ్స్ వరల్డ్ మీదుగా రాజ్‌విహార్ వరకు చేరుకుని అక్కడి నుంచి తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం కృష్ణమోహన్ విలేకరులతో మాట్లాడారు. సైక్లింగ్ ద్వారా పర్యావరణానికి హాని కలగదన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలన్నారు. వ్యాయామాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది ఉన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రా లయం రాఘవేంద్ర స్వామి దర్శనా ర్థం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారం సెలవుల దినాలు కావ డంతో ఆంధ్ర, కర్ణాటక, తమిళ నాడు, మహారాష్ట్ర, తెలంగాణ త దితర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తర లివచ్చారు. దీంతో మఠం పురవీధులతో పాటు మఠం ప్రాంగణం మార్మోగి పోయింది.

జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- శిక్షణ తరగతులు అభినందనీయం
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ముగిసిన సీఆర్ మీడియా అకాడమీ శిక్షణ

7లో



గోదాములో కుళ్లిపోయిన ఉల్లి

- క్వింటా రూ.30లకే విక్రయం
- నాణ్యమైన ఉల్లి రూ.900లకు అమ్మకం



వేలానికి మార్కెట్ కమిటీ అధికారులు సిద్ధం చేసిన ఉల్లి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు క్వింటం రూ.1,200కు కొనుగోలు చేసి గోదాములో నిల్వ ఉంచి ఉల్లి కుళ్లిపోతోంది. ఆదివారం దెబ్బతిన్న ఉల్లిని కిలో 4 పైసలు అంటే క్వింటం ఉల్లిని రూ.30లకే అమ్మేశారు. దాదాపు వారం పది రోజులుగా ఉల్లిని గోదాములోనే నిల్వ చేయడంతో చాలా వరకు ఉల్లి డ్యామేజీ అయింది. ఈ ఉల్లిని ఎలాగైనా మార్కెట్ యార్డు నుంచి బయటకు తరలించాలనే ఉద్దేశ్యంతో మార్క్‌ఫెడ్ అధికారులు వేలం పాట నిర్వహిస్తున్నారు. శనివారం 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని క్వింటా ఉల్లిని రూ.50ల నుంచి రూ.800 వరకు అమ్మారు. ఆదివారం ఈ ధర మరింతగా దిగజారింది. కేవలం రూ.30కే క్వింటం ఉల్లిని అమ్మేశారు. నాణ్యత గలిగిన ఉల్లిని రూ.900కు అమ్మేశారు. ఈరోజు 700 మెట్రిక్ టన్నుల ఉల్లిని విక్రయించామని, జేసీ బి.నవ్య ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించామని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు తెలిపారు. మార్కెట్ యార్డు సెక్రటరీ జయలక్ష్మి, మేనేజర్ రాజు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం యార్డుకు రైతులు పెద్ద ఎత్తున ఉల్లిగడ్డలు తీసుకువచ్చే అవకాశం ఉంటుందని, అందువల్ల మంగళవారం యార్డులో ఉల్లిగడ్డల క్రయ విక్రయాలు జరగవని తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు రైతులతో పెద్దఎత్తున నాణ్యతతో లేని ఉల్లిగడ్డలను తెప్పిస్తున్నట్లు జేసీ గుర్తించారని, అలా చేస్తే కమీషన్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమీషన్ ఏజెంట్లు ప్రతి షాపుకు కేవలం 400 బస్తాలకు మించి మార్కెట్ యార్డుకు తీసుకురాకుండా రైతులకు నచ్చజెప్పాలని సూచించారు. అలా కాకుండా అధిక మొత్తంలో తెప్పించిన కమీషన్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అమ్మకానికి ఉల్లిగడ్డలను యార్డుకు తెచ్చేటప్పుడు గ్రామంలోనే ఆరబెట్టి గ్రేడింగ్ చేసి ఎటువంటి మురుగులు లేకుండా నాణ్యమైన ఉల్లిగడ్డలను తీసుకురావాలన్నారు. తమ వెంట తప్పనిసరిగా ఈ-పంట నమోదు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పొలం పాసు పుస్తకం, బ్యాంకు అకౌంటు బుక్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీశైలానికి తగ్గిన వరద

- ఐదు గేట్లతో నీటి విడుదల
- నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలు



ఐదు గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల జలాశయానికి వరద తగ్గింది. ఆదివారం రాత్రి 7గంటల సమయానికి ఐదు గేట్ల గుండా 1,37,390 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 883 అడుగులు ఉండగా నీటినిల్వ సామర్థ్యం 208 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ జూరాల స్పిల్‌వే, సుంకేసుల నుంచి 1,28,949 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరాయి. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,930 క్యూసెక్కులు విడుదల చేశారు. శ్రీశైలం డ్యామ్‌కు వరద ప్రవాహం తగ్గేకొద్ది గేట్ల సంఖ్యను ఇంజనీర్లు తగ్గిస్తున్నారు. గడిచిన ఇరవై నాలుగు గంటల్లో రెండు విద్యుత్ కేంద్రాల్లో 32.008 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

దొంగ మస్టర్లకు చెక్

- ఉపాధి హామీ కూలీలకు ఇక ఈకేవైసీ
- పైలట్ ప్రాజెక్టుగా కర్నూలు, చిత్తూరులో అమలు



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద దొంగ మస్టర్లకు చెక్ పడనుంది. ఇక నుంచి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి అని కేంద్రం నిర్ణయించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు, సిబ్బందితో పాటు గ్రామాల్లోని రాజకీయ నాయకులు, వారి అనుచరులు ఉపాధి హామీ పథకాన్ని పెద్దఎత్తున పక్కదారి పట్టించి నిధులను స్వాహా చేయడం అలవాటుగా మార్చుకున్నారు. నెలకోసారి గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల ప్రగతిని అదే విధంగా నిధుల దుర్వినియోగాన్ని పరిశీలించేందుకు నెలకోసారి నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ కూడా నామమాత్రంగానే జరుగుతోంది. నిధుల అక్రమాలను నిగ్గు తేల్చి వాటిని రికవరీ చేయడంలో అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదనే ఫిర్యాదులు ఇటీవలే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ డ్వామా విభాగాల ఉన్నతాధికారులకు చేరాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో దొంగమస్టర్లను నిరోధించేందు కోసం ఈకేవైసీ విధానాన్ని ప్రవేశ పెట్టింది.

అక్టోబరు 1వ తేదీ నుంచి అమలు

అక్టోబరు 1వ తేదీ నుంచి కర్నూలు, చిత్తూరు జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. కూలీల ఆధార్‌ను అనుసంధానం చేయడం ద్వారా ఒకరి బదులు మరొకరు పనికి రాకుండా నిరోధించవచ్చు. దీని ద్వారా నిజమైన కూలీలకే డబ్బులు అందుతాయని, అవినీతి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఉపాధి పనులు చేస్తున్న కార్మికులకు ఈకేవైసీ అక్టోబరు నుంచి ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

లోటుపాట్లను గుర్తించి..

కూలీలకు ఈకేవైసీ నమోదు ప్రక్రియ విధానం అక్టోబరు 1వ తేదీ నుంచి మొదలు పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు పంపింది. మొదటగా ఏపీలో కర్నూలు, చిత్తూరు జిల్లాలో అమలుచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. లోటుపాట్లను గుర్తించిన తర్వాత పూర్తిస్థాయిలో అన్నిజిల్లాలోనూ ఈ విధానం అమలవుతుంది.

● వెంకట్రామయ్య, డ్వామా పీడీ, కర్నూలు



ప్రజల గొంతుకే బలం

ఆత్మకూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛాయుతమైన ప్రజాతీర్పే నిజమైన ప్రజాస్వామ్యానికి నాందిగా నిలుస్తుంది. అయితే నానాటికి రాజకీయ విలువలు క్షీణిస్తూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. వాస్తవానికి ప్రజాస్వామ్యం అనేది ఒక రాజకీయ భావన లేదా ప్రభుత్వ ఏర్పాటు విధానంగా చెప్పవచ్చు. ఇందులో ప్రజల నిర్ణయాధికారాలే కీలకం. నేటికి ప్రపంచంలోని అనేక దేశాల్లో రాచరిక, కులీన వ్యవస్థలు కొనసాగుతున్నప్పటికీ మనదేశంలో మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థ పరిడవిల్లుతోంది. అందుకే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్ ఈ గుర్తింపు దక్కించుకుంది. అయితే మనదేశంలో ప్రజాస్వామ్య రెండు రకాలుగా అమలవుతోంది. అవి ప్రత్యక్ష, పరోక్ష ప్రజాస్వామ్య వ్యవస్థలుగా ఉన్నాయి. 1951-52లో నుంచి మనదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమలై తొలిసారిగా సాధారణ ఎన్నికలు జరిగాయి. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1973లో దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించారు. అయితే ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం హక్కులను కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజల్ని ప్రలోభాలకు గురిచేసేందుకు చేస్తున్న స్వార్థపూరిత విధానాలు ప్రజాస్వామ్య వ్యవస్థకే తూట్లు పడేలా చేస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువలను, ప్రయోజనాలను పౌరులందరికి తెలియపర్చేందుకు ప్రతిఏటా సెప్టెంబరు 15వ తేదిన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

- స్వేచ్ఛాయుత ప్రజాతీర్పుతోనే నిజమైన ప్రజాస్వామ్యం
- నేడు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం

ఎప్పుడు మొదలైందంటే..

ప్రపంచంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో 2007లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రతిఏటా సెప్టెంబరు 15న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించింది. ఆ తర్వాత 2008 సెప్టెంబరు 15వ తేదిన తొలిసారిగా అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతిఏటా విద్యార్థులకు వర్క్‌షాప్‌లు, డిబేట్స్, పౌర సమాజ సంస్థలతో సమావేశాలు తదితర కార్యక్రమాలను నిర్వహించాలని నిర్దేశించింది. అదేక్రమంలో ప్రతిఏటా ఒక నినాదంతో ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది లింగ సమానత్వాన్ని సాధించడం, చర్య ద్వారా చర్య అనే నినాదాన్ని ఎంపిక చేశారు.



మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఇలా..

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా పేరుగాంచిన మనదేశంలో ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగుతోంది. ప్రత్యేకించి ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానంలో ప్రజలందరూ భాగస్వాములుగా ఉంటారు. స్థానిక సంస్థల మొదలుకొని చట్టసభల వరకు ప్రాతినిథ్యం వహించే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రజలే నేరుగా ఎన్నుకునే అధికారం ఉంటుంది. ఇందులో ప్రజలే ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటారు. పరోక్ష ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారా విధాన పరిషత్ పాటు రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, గవర్నర్, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలతో పాటు పలు నామినేటెడ్ పదవుల నియామకం పరోక్ష ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియ కూడా ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల ద్వారా ఎన్నుకుంటారు.



ప్రజలు ప్రలోభాలకు గురికాకూడదు

ఓటు అనే వజ్రాయుధంతో ప్రజాప్రతినిధుల్ని ఎన్నుకునే అధికారం ప్రజలకు ఇవ్వడం శుభపరిణామం. ప్రజలు కూడా అభ్యర్థుల ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిజాయితీతో ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీంతో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించి ప్రజలకు మెరుగైన పాలన అందించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం వుంటుంది.

● వెంకటేశ్, ఉపాధ్యాయుడు, ఎంపీపీ పాఠశాల, కొట్టాల చెరువు, ఆత్మకూరు మండలం.



ప్రజల్లో చైతన్యం రావాలి

ప్రజాస్వామ్య వ్యవస్థ కులమతాలకు అతీతంగా కొనసాగడం దేశానికి శ్రేయస్కరం. అలాంటప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. తద్వారా ప్రజాస్వామ్య పరిడవిల్లేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం వుంది.

● అమీర్ అహ్మద్, ఎంపీపీ పాఠశాల, కొట్టాల చెరువు, ఆత్మకూరు మండలం

ఒరిస్సా టు పంచలింగాల

- గుట్టుగా గంజాయి రవాణా
- కర్నూలులో 20మందికి పైగా ఏజెంట్లు
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

కర్నూలు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా నుంచి కర్నూలు జిల్లా పంచలింగాల కేంద్రానికి గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సరఫరా అవుతోంది. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు విక్రయిస్తున్న ముఠాను నా లుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సినీ ఫక్కీలో నిందితులు గంజాయిని కారు డోర్‌లో ఉంచి తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పంచలింగాల చెందిన నరేంద్ర, హరీఫ్, మృత్యుంజ యరెడ్డి, ఉమేష్ చంద్రలతో పాటు మరో యువకున్ని అదుపులోకి తీసుకు న్నారు. పోలీసులు విచారిస్తే ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.

ఎన్నో ప్లాన్లు రూపొందించుకుని..

పంచలింగాలకు చెందిన నరేంద్ర అనే వ్యక్తి ప్రధాన నిందితుడుగా గుర్తించారు. అతడు ఎవరికీ అనుమానం రాకుండా ఎన్నో ప్లాన్లు రూపొందిం చుకుని గంజాయి సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణలో తేలింది. ముందుగా ఒరిస్సా అరుకు వ్యాలీ తదితర ప్రాంతాలకు టూర్‌కు వెళ్లినట్లు వెళ్లాడు. ఓకారు అద్దెకు తీసుకుని నలుగురి స్నేహితులను ఎక్కించు కుని వారికి అన్ని వసతులు తానే సమకూర్చి తీసుకెళ్లాడు. అక్క డ ఓ మూడు నాలుగు రోజుల పాటు టూర్ ఎంజాయ్‌చేసి వస్తూ వస్తూ గంజాయిని తీసుకువ స్తాడు. పంచలింగాల వచ్చిన తర్వాత వాటిని సిగరెట్లలో నింపి విక్రయి స్తాడు. ఇవి విక్రయించేందుకు కర్నూలులో 20మంది ఏజెంట్లను నియ మించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో ఓ ఏడు మంది పేర్లు వెల్లడించినట్లు తెలిసింది.

కారు డోరుకు హ్యాండిల్..

సినిమా ఫక్కీలో గంజాయిని కారు డోరుకు హ్యాండిల్ ప్లాస్టిక్ సీటుకు మధ్యలో స్క్రూలు విప్పి అందులో గంజాయిని నింపి తిరిగి స్క్రూలు బిగిం చి ఎంచక్కా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒకవేళ పోలీసులు తనిఖీలు చేస్తే టూర్ వెళ్తునానమని చెబుతారు. కారు తనిఖీ చేసినా పెద్దగా కనిపించదు. ఇలా నెలలో మూడు నాలుగుసార్లు వివిధ కార్లను తీసుకెళ్తూ.. స్నేహితు లను మారుస్తూ ఈ గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మిగతా విషయాలు సోమవారం వెల్లడించే అవకాశం ఉంది. ప ట్టుబడిన నిందితులో ఒకరి తండ్రి నంద్యాల జిల్లాలో ఏఆర్ హెడ్ కానిస్టేబు ల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం

సునిశిత భావాలతో కవిత్వం రాయడం అరుదు

- కళారత్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య
- కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన 'పుంజుతోక' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జి. పుల్లయ్య, పత్తి ఓబులయ్య, రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పనిచేస్తూ సునిశిత భావాలతో కవిత్వం రాయడం అరుదైన విషయమని, నేడు అది ఒక్క శ్రీనివాసరెడ్డికే సాధ్యపడిందని కళారత్న, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొత్తకోట శ్రీనివాసరెడ్డి రాసిన 'పుంజుతోక' కవితా సంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు పత్తి ఓబులయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పుస్తక రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఉన్నత భావాలు, నైతిక విలువలు కలిగిన పోలీసు అధికారి అని అభినందించారు. శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పీబీవీ సుబ్బయ్య మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి తనకు మిత్రుడని, డిగ్రీ చదివే కాలం నుంచీ ఆయనకు తెలుగు సాహిత్యం పట్ల ప్రత్యేక ఆసక్తి, అభిలాష ఉందని గుర్తు చేశారు. పుస్తక సమీక్ష చేసిన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, ప్రముఖ రచయితలు డాక్టర్ ఎం.హరికిషన్, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని మాట్లాడుతూ పుంజుతోక కవితా సంపుటిలో మొత్తం 120 కవితలున్నాయని, అవి సులభశైలిలో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో రాశారన్నారు. పుస్తక రచయిత, విశ్రాంత డీజీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తాను పుట్టిన కర్నూలు జిల్లాలో తన రచన 'పుంజుతోక' కవితా సంపుటి ఆవిష్కరించుకోవడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో పుస్తకంలోని పద్యాలను గజల్ గాయకుడు మహమ్మద్‌మియా, రంగస్థల కళాకారుడు కే బాలవెంకటేశ్వర్లు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సభలో రచయిత తల్లిదండ్రులు, టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, కోశాధికారి కె. రామస్వామి, సీనియర్ నటులు పి. రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, కేవీ రమణ, సీవీ రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- శిక్షణ తరగతులు అభినందనీయం
- కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు
- ముగిసిన సీఆర్ మీడియా అకాడమీ శిక్షణ



మాట్లాడుతున్న సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని మౌర్య ఇన్‌లో గల పరిణయ ఫంక్షన్ హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సహకారంతో రెండు రోజులుగా కొనసాగిన 'గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు' ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలు, సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా మాట్లాడుతూ అకాడమీ చేపట్టిన ఈశిక్షణల ద్వారా గ్రామీణ విలేకర్లు తమ వృత్తిపరంగా మరింత ముందుకు పోయే అవకాశం ఉందన్నారు. ఉదయం సెషన్‌లో గ్రామీణ వార్తలు, కథనాలు కొత్త తరహాలో ఎలా రాయాలో సీనియర్ జర్నలిస్టు డి.సోమసుందర్ తెలియజేశారు. మరో సెషన్‌లో పత్రికా భాషపై సీనియర్ జర్నలిస్టు శంకర నారాయణ భాషాదోషాలు, నిర్ధారణ లేని వార్తలను ప్రచురించడంతో కలిగే నష్టాలను ఆయన పలు ఉదాహరణల ద్వారా తెలియజేశారు. వివిధ సెషన్స్ ద్వారా శిక్షణలు అందించిన వారిని ఎంపీ నాగరాజు, ఏఎస్పీ హుస్సేన్‌పీరా, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, సమాచారశాఖ డీడీ జయమ్మ సత్కరించారు. కార్యక్రమంలో సీఆర్ మీడియా కార్యదర్శి మణిరాం, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఏచూరి శివ, ఐజేయూ సభ్యుడు నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్రకార్యదర్శి కొండప్ప, గౌరవాధ్యక్షులు ఎస్‌వీ సుబ్బయ్య, కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసగౌడ్, నాయకులు అంజి, శివ ప్రసంగించారు.

భవిష్యత్తులోనూ దశలవారీగా..

సీఆర్ మీడియా అకాడమీ ద్వారా జర్నలిస్టులకు మరిన్ని కార్యక్రమాలను భవిషత్తులోనూ దశలవారీగా నిర్వహిస్తామని సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ తెలిపారు. జర్నలిస్టులకు అవసరమైన ఏడు ప్రధాన అంశాలపై రెండు రోజుల పాటూ ఏడు సెషన్స్‌లో నిపుణులతో శిక్షణలు ఇప్పించామని తెలిపారు.

ఫీచర్లను పాఠకులు ఎప్పుడూ ఆదరిస్తారు

సాధారణ వార్తల కన్నా, ఫీచర్లను పాఠకులు ఎప్పుడూ ఆదరిస్తారని, ఆ దిశగా ప్రతి విలేకరి కృషి చేయాలని ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు సూచించారు. పల్లెల్లో జరిగే జాతరలు, తిరునాళ్లు ఇలా ఏదైనా చూసే కోణాన్ని బట్టి కొత్తకొత్త ఫీచర్లు రాసే అవకాశం లభిస్తుందని తెలిపారు.

క్రైం వార్తల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

క్రైం వార్తలు రాజేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు విలేకరులకు అవగాహన కల్పించారు. సీఎం చంద్రబాబుతో చర్చించి అర్హులందరికీ అక్రిడిటేషన్లు, హెల్త్ బీమాలు అమలయ్యేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

మెట్లపై నుంచి పడి వృద్ధురాలి మృతి

మంత్రాలయం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రామ చంద్రనగర్‌లో మెట్లపై నుంచి కింద పడి లక్ష్మీదేవమ్మ (75) మృతి చెందారు. ఆదివారం సాయంత్రం తన ఇంటి మెట్లు దిగుతుండగా.. కాలు అదుపు తప్పడంతో తలకు రక్తగాయమైంది. గమనించిన ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించేలోపే మృతి చెందారు. మృతురాలు గత పదిహేనేళ్ల కింద మంత్రాలయం విద్యుత్ శాఖలో స్వీపర్‌గా పని చేస్తూ రిటైర్డు అయ్యారు.

వ్యక్తికి రిమాండ్

దేవనకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకును చంపిన కేసులో నిందితుడు దేవనకొండకి చెందిన నరేష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు. బాలుడిని డ్రమ్ములో ముంచి హత్య చేసి, భార్యపై తీవ్రంగా దాడిచేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఆదివారం మధ్యాహ్నం వెలమకూరు బస్టాప్ సమీపంలో నిందుతుడిని అరెస్టు చేసి, పత్తికొండ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా, న్యాయాధికారి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

గర్భిణి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమేనంటున్న బంధువులు
- ఆసుపత్రిపై దాడి.. అద్దాలు ధ్వంసం
- పోలీసుల రంగప్రవేశం



హబీబా(ఫైల్)

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె మృతి చెందిందంటూ బంధువులు శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆసుపత్రిపై దాడికి పాల్పడ్డారు. అద్దాలు ధ్వంసం చేశారు. హాస్పిటల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బంధువులు తెలిపిన వివరాలు.. శిరువెళ్లకు చెందిన జమాల్‌బాషా కూతురు హబీబాకు ఏడాది క్రితం వివాహమైంది. ఆమె మొదటి నుంచి ఓ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. ఈనెల 12న పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. మొదట సాధారణ డెలివరీ చేస్తామని చెప్పిన వైద్యులు తర్వాత అత్యవసరంగా సిజేరియన్ చేసుకోవాలని సూచించారు. దీంతో సిజేరియన్ చేసి బిడ్డను సురక్షితంగా తీశారు. హబీబా అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. దీంతో కోపో ద్రిక్తులైన మృతురాలి బంధువులు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆసుపత్రిపై దాడికి పాల్పడ్డారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మృతురాలి తండ్రి

కార్డియాక్ అరెస్ట్ వల్లనే..

హబీబాకు మొదట సాధారణ డెలివరీ చేస్తామని అనుకున్నాం. రక్తం కూడా 12.3 గ్రాములు ఉంది. అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేశాం. బిడ్డ సురక్షితంగా ఉంది. ఉమ్మినీరు ఊపిరితిత్తుల్లోకి చేరి కార్డియక్ అరెస్ట్ అయి హబీబా మృతి చెంది ఉండవచ్చు.

● డాక్టర్ ఫాతిమా, గైనకాలజిస్ట్

పూర్వ విద్యార్థుల కలయిక

అలనాటి గురువులకు ఘన సన్మానం



మొలగవల్లిలో గురువులతో 1995-96 పూర్వ విద్యార్థులు

ఆలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 30 ఏళ్ల తరువాత తమ మిత్రులు, ఉపాధ్యా యులను కలిశారు. తమను గుర్తుంచుకుని సన్మానించడం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు ఆంజనేయులు, ప్రభాకర్‌రావు, హేమలత, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్, సత్యనారాయణరావు, రేఖ సాగర్, శ్రీరాములు, మదర్ సాబ్, సత్యనారాయణ అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నంద్యాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1973-76 బీఎస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ డిప్యూటీ డీఈవో బ్రహ్మానందరెడ్డి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూర్వ అధ్యాపకులు రామచంద్రారెడ్డి, రామిరెడ్డి హాజరయ్యారు. పూర్వవిద్యార్థులైన ఏఎస్పీ విల్సన్ గిటారు వాయించగా, ప్రముఖ గాయకుడు ప్రభాకర్ పాటలతో అలరించారు. విశ్రాంత హెచ్ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో..



తిరుపతి పట్టణంలో నిర్వహించిన జాతీయ మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరిత



నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

కష్టం..నష్టం



వీడని వర్షాలు.. ఉల్లి రైతుకు కన్నీళ్లు

నిలిచిపోయిన పత్తి తీత పనులు

వానలు ఇలాగే కొనసాగితే సజ్జ, కంది కూడా చేతికిరావు

ఆందోళనలో రైతన్నలు

రైతన్నను వర్షాలు వదల బొమ్మాళీ అన్నట్టు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. ఏకధాటి వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా పత్తి పంటకు సుమారు రూ.30 వేలు, వేరుశనగకు రూ. 40 వేలు, ఉల్లి రూ.25వేలు, సజ్జ, కంది పంటలకు రూ. 15వేల వరకు పెట్టుబడి పెట్టామని, అధిక వర్షాలతో పంట మొత్తం కుళ్లిపోతోందని ఆవేదన చెందుతున్నారు.


చెట్టు నుంచి రాలిపోతున్న పత్తి

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో కంది, పత్తి, ఉల్లి, సజ్జ, వేరుశనగ పంటలు సాగు చేశారు. ప్రధానంగా బోరు బావుల కింద అధికంగా ఉల్లి సాగు చేశారు. ఉల్లి చేతికొచ్చిన సమయంలో వరుసగా కురుస్తున్న వర్షాలతో రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. గత నెలలో సుమారు 20 రోజుల పాటు వర్షం పడింది. దీంతో ఉల్లి రైతులు దారుణంగా దెబ్బతిన్నారు. పొలాల్లో పీకి ఉంచిన ఉల్లి కోతలు ఆలస్యమయ్యాయి. దీనికితోడు మార్కెట్లో గిట్టుబాటు ధర అందకపోవడం రైతులను మరింత కుంగదీసింది. కొందరు రైతులు రేటు పెరగకపోతుందా అనే ఆశతో కోతలు వాయిదా వేసుకుంటున్నారు. పది రోజులుగా పత్తితీత పనులు ప్రారంభమయ్యాయి. పత్తి సాగు చేసిన రైతులు పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కొందరు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించి కిలో రూ.12 ప్రకారం పత్తి తీయిస్తున్నారు. రెండు, మూడురోజులుగా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురవడంతో పనులు ఆగిపోయాయి. పొలాల్లో దిగడానికి బురద ఆటంకంగా మారింది. మరో మూడు రోజులపాటు వర్షప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చేతికందిన దిగుబడులు దెబ్బతింటాయని భయపడుతున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే సజ్జ కంకులు నల్లబారడం, కంది ఎర్రబడడం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కళకళలాడుతున్న వర్షాధార ఉల్లి

మండలంలోని వెంకటగిరి గ్రామంలో వర్షాధారం కింద సాగు చేసిన ఉల్లి పంటలు కళకళలాడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రసాయనిక ఎరువులు వేస్తూ రైతన్నలు బిజీగా ఉన్నారు. అవసరమైన పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. ఈఒక్క గ్రామంలోనే సుమారు 1500 ఎకరాల వరకు ఉల్లి సాగైనట్లు అంచనా. దీంతో ఈ గ్రామంలో కనుచూపు మేర ఉల్లి పైరులే దర్శనమిస్తున్నాయి.


వెంకటగిరిలో కళకళలాడుతున్న ఉల్లి పంట

వాల్మీకి ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ


వాల్మీకి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ సభ్యులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డా.బోయ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి వాల్మీకి ఉద్యోగుల సంఘం సమావేశంలో నూతన రాష్ట్ర కమిటీకి జరిగిన ఎన్నికల్లో లక్ష్మీనారాయణను ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గట్టు లక్ష్మీకాంత్, సహాయ కార్యదర్శిగా నల్లబోతుల రఘునాథ్‌ను ఈ ఎంపిక పట్ల సంఘం అధ్యక్షుడు డా.మల్లన్న, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు, కోశాధికారి వెంకటరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

'మైనార్టీల సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం'


మాట్లాడుతున్న ఎంఏ.చిస్తి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ.చిస్తి అన్నారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం మైనార్టీ సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. మసీదుల ఖర్చుల నిమిత్తం నెలకు పదివేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి ఇవ్వలేదన్నారు. సమావేశంలో నగర కమిటీ అధ్యక్షుడు ఇ.ఇక్బాల్ హుస్సేన్, గౌరవ అధ్యక్షుడు ఇస్మాయిల్‌బాబు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ నయీమ్, అబ్దుల్ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతను పారాయణం చేయాలి


ప్రజలకు భగవద్గీతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భగవద్గీతను పారాయణం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కే.రామచంద్రుడు అన్నాడు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక మిడ్తూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత పై ప్రజలకు అవగాహన కల్పించారు. కే.రామచంద్రుడు మాట్లాడుతూ త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణ భగవానుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, సభ్యులు గోకారి, శ్రీను, రాఘవేంద్ర, రవి, జగదీష్, సుబ్బలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

● రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నేర ప్రవృత్తికి స్వస్తి పలికి ప్రశాంత జీవనం గడపాలని ఆయా పోలీస్‌స్టేషన్ల పోలీసులు అన్నారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్‌లలో రౌడీషీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు ప్రవర్తన కలిగిన వారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా సత్ప్రవర్తనతో జీవించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

● జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ రమణయ్య


మాట్లాడుతున్న ఏవీ రమణయ్య

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ రమణయ్య అన్నారు. రెండు రోజులుగా బిర్లా గేటులోని జేవీవీ జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జేవీవీ 'ఉపన్యాస జాతా' కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ రాష్ట్రస్థాయి జాతాలో రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి విచ్చేసిన జేవీవీ కళాకారులు మాట, పాట, ఆట అంశాలుగా విభిన్న ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అలాగే ఔత్సాహిక జేవీవీ సభ్యులు, కార్యకర్తలకు, విద్యార్థులు మ్యాజిక్ అంశంపై శిక్షణలు ఇచ్చారు. ఈ శిక్షణల్లో దొంగ బాబాలు, స్వామిజీలు, ఫకీర్లు చేసే హస్తలాఘవ ప్రదర్శనలు సవివరణాత్మకంగా తెలియజేశారు. ఏవీ రమణయ్య మాట్లాడుతూ జేవీవీ ప్రజల్లో సామాజిక చైతన్యం తీసుకువచ్చే దిశగా దశాబ్దాలుగా కృషిచేస్తోందని తెలిపారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి బి. విశ్వనాథం మాట్లాడుతూ సైన్సుద్వారా నిరూపితమైన అంశాలనే ప్రతిఒక్కరూ నమ్మాలని సూచించారు. జేవీవీ జాతీయ కార్యదర్శి మహమ్మద్ మియా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో పదోతరగతి వరకు సైన్సు పుస్తకాల్లో శాస్త్రీయంగా రుజువైన అనేక విషయాలను బోధిస్తారని, ఆ పాఠాలు కూడా ప్రతి ఒక్కరి జీవితంలో ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, వివిధ జిల్లాల ప్రతినిధులు శేషాద్రిరెడ్డి, రమేష్, రెడ్డప్ప, కడప రాజశేఖర్, నంద్యాల మధు, దామోదర్, ఖాజా వలి, జయ, మీనా, నారాయణరెడ్డి, బి. సురేష్ పాల్గొన్నారు.

కూటమితోనే బీసీలకు న్యాయం


సమావేశానికి హాజరైన డీసీఎంహెచ్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమం సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా డీసీఎంహెచ్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన టీడీపీ బీసీ సెల్ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలను తీసుకెళ్లాలని సభలో కోరారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలోని బీసీలకు సంక్షేమం, అభివృద్ధి అందించే ప్రక్రియలో ఇప్పటికే ఎన్నో రుణాలు, పథకాలు అందించారని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఏ.సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం ఎరువు లభించక, బ్లాక్ మార్కెట్‌లో కొనలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఎరువుల కొరతను తీర్చడంలో విఫలమైందని ఆరోపించారు. నిరసనకు కార్యకర్తలు, రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిటీ అధ్యక్షులు షేక్ జీలాని బాషా, అనంతరత్నం మాదిగ, ఎస్సీ బజారన్న, కే. రాఘవేంద్ర రెడ్డి, షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను ఇప్పించండి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

కర్నూలు రూరల్ సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): అరబిందో సంస్థ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని 104 అంబులెన్స్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు కళ్యాణి, ట్రెజరర్ చంద్రహాస్, రాజేష్, సుమంత్‌రెడ్డి సంయుక్తంగా ఆదివారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే 104 అంబులెన్స్ ఉద్యోగులకు హామీ ఇచ్చారు.

నేడు నగర పాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, నగర పరిధిలోని ప్రజలు తమ కాలనీలోని సమస్యలు ఏవైనా ఉంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఘనంగా గాడిచర్ల స్మారక పురస్కార ప్రదానం


గాడిచర్ల పురస్కారాన్ని డాక్టర్ మన్నం వెంకటరాయుడు దంపతులకు అందజేస్తున్న కేసీ కల్కూర, సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు జిల్లాకు చెందిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి, ప్రముఖ సాహితీవేత్త మేడూరి దీక్షితుల వెంకటసుబ్బయ్య జయంతి కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. నగరంలోని మద్దూరునగర్‌లో గల పింగళి సూరన తెలుగుతోట సమావేశహాలులో, రాష్ట్ర గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ, సాహితీ సదస్సు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాడిచర్ల పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ మన్నం వెంకటరాయుడు దంపతులుకు అందజేసి, వారిని సత్కరించారు. ఈ సమావేశంలో ప్రముఖ రచయిత్రి రావి శారద, గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, సాహితీవేత్తలు జేఎస్ఆర్‌కే శర్మ, డాక్టర్ డి. పార్వతీదేవి, తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన డాక్టర్ పరిమళ, డాక్టర్ అనూష, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మాదిగ దండోరా జిల్లా అధ్యక్షురాలిగా సూర్యపోగు అలేఖ్య


సూర్యపోగు అలేఖ్యకు నియామక పత్రం అందిస్తున్న అనంతరత్నం మాదిగ

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాదిగ దండోరా జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సూర్యపోగు అలేఖ్యను నియమించామని వ్యవస్థాపక అధ్యక్షుడు అనంతరత్నం మాదిగ తెలిపారు. ఆదివారం నగరంలోని ఎల్బీజీ నగర్‌లో జరిన సర్వసభ్య సమావేశంలో ఆమెకు ఆయన నియమకపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కోసం రాయలసీమలోని మహిళలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటాలు చేస్తానని తెలిపారు. ప్రభుత్వానికి బాధితులకు మధ్య వారధిగా పని చేసి సమస్యలు లేని సమాజం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంబారి లలితమ్మ మాదిగ, బొగ్గుల హైమావతి మాదిగ, మహిళలు పాల్గొన్నారు.

నగరంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాల్మీకి సంఘాల ఆధ్వర్యంలో గౌరి గోపాల్ సర్కిల్ వద్ద వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య వాల్మీకి విగ్రహానికి రూ.2లక్షలు ప్రకటించారు. ఈ మేరకు వాల్మీకి సంఘాలు ఆదివారం వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేశామని నాయకులు తెలిపారు. జిల్లాలోని వాల్మీకులందరూ ప్రత్యేకంగా పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు

కల్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా కర్నూలు జేఏసీ ఆధ్వర్యంలో దశలవారి ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు జేఏసీ చైర్మన్ సతీష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర జేఏసీ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకు విద్యుత్ ఉద్యోగుల ఆందోళన కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 15, 16 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధుల నిర్వహణ, 17, 18న ఆత్మకూరు డివిజన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 19, 20 తేదీల్లో కర్నూలు ఎస్ఈ కార్యాలయంలో రిలే నిరాహారదీక్ష ఉంటుందన్నారు. అనంతరం 22న జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ వరకు శాంతి ర్యాలీ, వినతిపత్రం అందించనున్నట్లు స్పష్టం చేవారు. ఉద్యోగులకు సంబందించిన 13 న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రతి ఒక్కరూ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ సూచించారు.

చిన్నారులకు క్రీడలు అవసరం


క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న అడ్వకేట్ శ్రీధర్‌రెడ్డి

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు క్రీడలు ఎంతో అవసరమని అడ్వకేట్ జి.శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని దేవనగర్‌లో ఉన్న గుడ్ షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో 17వ రాష్ట్ర స్థాయి మినీ సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, పీఈటీల అసోసియేషన్ అధ్యక్షులు చిన్న సుంకన్న, ప్రకాశం జిల్లా చంద్రశేఖర్, నంద్యాల మహబూబ్ బాషా, కడప రాజవర్దన్, విశాఖ రాజారావు, గుంటూరు అలివేలు, బాపట్ల నాగమ్మ, కర్నూలు నాగ శ్రీనివాసులు, పీఈటీ మధు పాల్గొన్నారు.

ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు వద్ద ఆదివారం ఒకే చోట రెండు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఉదయం స్లాగ్ మెటీరియల్‌తో కర్నూలు వైపు వెళుతున్న లారీ ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను క్రాస్ చేస్తుండగా ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ ముందు భాగం దెబ్బతింది. ఎవరికి గాయాలు కాలేదు. ప్రమాదానికి గురైన లారీ అలాగే ఉంచారు. ఈ లారీ వెనుక మరో రెండు లారీలను నిలిపి ఉంచారు. సాయంత్రం చీకటి పడ్డాక మోటర్ బైక్‌పై వెళ్తున్న దంపతులు నిలిచి ఉన్న ఓ లారీని ఢీకొన్నారు. దీంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు గాయపడిన వారిని పెద్దపాడు గ్రామానికి చెందిన మాధు, సావిత్రమ్మ దంపతులుగా గుర్తించారు. క్రిష్టాపురం గ్రామంలో బంధువు దినకర్మకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలపారు.

రాజ్యాంగ సంస్థలను ప్రజా చైతన్యంతోనే రక్షించుకోవాలి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సంస్థలను ప్రజాచైతన్యంతోనే రక్షించుకోవాలని జేవీవీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్టీయూ సలాంఖాన్ భవన్ సమావేశ హాలులో 'ఎన్నికల కమిషన్ పనితీరు - ప్రజాస్వామ్యంపై ప్రభావం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి గత ఎన్నికలలో ఎన్నో అవకతవకలు జరిగినా పట్టించుకోవడం లేదని అన్నారు. దేశంలో ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠ దిగజారిపోయిందని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినప్పుడు బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలలో జరిగినటువంటి తిరుగుబాట్లు జరుగుతాయని హెచ్చరించారు. యువతరం చైతన్యవంతం కావాలని, ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య సంఘాలపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. సదస్సులో వేదిక రాష్ట్ర కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు హమీద్, అబ్దుల్ అజీజ్ ఖాన్, యోహాన్, డేవిడ్, రత్నం ఏసేపు, రమేష్, రవిప్రకాశ్, శేషాద్రిరెడ్డి, రజాక్, జహంగీర్ అహమ్మద్, షబ్బీర్ అహ్మద్ ప్రసంగించారు.



ఆస్పరి, కలపరి, బనవనూరు, ఆస్పరి గ్రామాల్లో విద్యుత్ సర్వీస్ తీగలు భవనాలను తాకుతూ వేశారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు పోయే అవకాశం ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ ఆంజనేయ శాస్త్రిని వివరణ కోరగా పరిష్కరిస్తామని తెలిపారు. - ఆస్పరి



మండలంలోని ఎద్దులదొడ్డి, రాంపల్లి క్రాస్ గ్రామాల మధ్య పత్తికొండ- ప్యాపిలి ప్రధాన రహదారిపై భారీగా గుంతలు పడ్డాయి. ఈ మార్గంలో రావడానికి వాహనదారులు జంకుతున్నారు. వర్షాలు కురిసిన వెంటనే గుంతల్లో మోకాల్లోతు నీరు నిలుస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. - తుగ్గలి

టమోటా కొనుగోళ్లు ప్రారంభం

సీఎం ఆదేశాల మేరకు కిలో రూ.8ల ధర

పత్తికొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆదివారం టమోటా కొనుగోళ్లను ప్రారంభించారు. నాలుగు రోజులుగా ధరలు పతనమవుతున్నాయని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గిట్టుబాటు ధర ప్రకారం కొనుగోలు చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. ఈమేరకు మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నలిస్ సిబ్బందితో కలిసి టమోటా కొనుగోళ్లను ప్రారంభించారు. మార్కెట్‌కు 40 టన్నులు రాగా ఇప్పటికి 9 టన్నులను కిలో రూ.8ల చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు టమోటాను గ్రేడింగ్ చేసి తీసుకువచ్చి సహకరించాలని కోరారు. కాగా మార్కెట్ యార్డు అధికారులు కొనుగోళ్లను ప్రారంభించడంతో స్థానిక వ్యాపారులు రూటు మార్చి కిలోకు రూ.8ల పైగానే కొనుగోలు చేయడం గమనార్హం.

దుండగులను వదిలిపెట్టం : ఎంపీ



ఎంపీని కలిసిన మణేకుర్తి కురువ సంఘం నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వదిలిపెట్టమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆదివారం మణేకుర్తి గ్రామ కురువ సంఘం నాయకులు ఎంపీని కలిసి విగ్రహం ధ్వంసం ఘటనపై విన్నవించారు. దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేయాలని పోలీసు అధికారులకు ఎంపీ సూచించారన్నారు.

నానో యూరియాతో భూసారం

తుగ్గలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వాడితో భూసారం పెరిగి, ఉత్తమ ఫలితాలు వస్తాయని ఏవో సురేష్ యాదవ్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో పంటలకు ఎక్కువ సత్తువ అందుతుని ప్రభుత్వం యూరియాను సిద్ధంగా ఉంచిందన్నారు. ప్రతి రైతు 'ఈక్రాప్' నమోదు చేయించుకోవాలని, నమోదు చేయించకుంటే ప్రభుత్వ పథకాలు అందవన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్యం

● హొలహర్వి వైద్యాధికారి షాహినా



హొలహర్వి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వైద్యాధికారి షాహినా తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం ఉదయం 8.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. స్థానిక పీహెచ్‌సీలో అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తామని, 24 గంటల వైద్యసేవలు అందజేస్తామన్నారు. ఇద్దరు వైద్యులతో పాటు ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వేలాది రూపాయలను వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.

టీడీపీతోనే ముస్లింల అభివృద్ధి

వెల్దుర్తి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే ముస్లింలు అభివృద్ధి చెందుతారని మాజీ ఎంపీపీ టీడీపీ నాయకుడు జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణ సమీపంలోని షాదీఖానా ప్రహరీ నిర్మాణానికి ఆదివారం భూమి పూజ నిర్వహించారు.



భూమి పూజ చేస్తున్న జ్ఞానేశ్వర్‌గౌడ్

ఆదోనిలో అనసూయ సందడి

● జీవీ మాల్ ప్రారంభం



దుకాణంలో చీరను ప్రదర్శిస్తున్న అనసూయ



చీరను కొనుగోలు చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆదోని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పరి రోడ్డులో జీవీ మాల్ వస్త్ర దుకాణాన్ని టీవీ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఆదివారం ప్రారంభించారు. అనసూయ రానున్నారని తెలిసిన ప్రజలు, యువత పెద్దఎత్తును జీవీ మాల్ వద్దకు చేరుకున్నారు. అనసూయ మాల్ దగ్గరకు చేరుకుని 'హాయ్ ఆదోని' అంటూ పలకరించారు. అనంతరం జీవీ మాల్ నిర్వాహకుడు, ఎండీ ఉమామహేశ్వర్‌రావు, గుర్రం వాసు, రేవంత్, అంకిత్‌తో కలిసి అనసూయ రిబ్బన్ కట్‌చేసి షోరూంను ప్రారంభించారు. అనసూయతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పోటీ పడ్డారు. అనంతరం అనసూయ విలేకరులతో మాట్లాడుతూ మాల్ స్థానికులఅభివృద్ధికి దోహదపడాలని కోరుకుంటున్నానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మాల్ ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఇది పునాది అన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ నాయకులు, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, చాగి మల్లికార్జునరెడ్డి, బుద్దారెడ్డి పాల్గొన్నారు. సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



రామచంద్రుడు(ఫైల్)

వెల్దుర్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన రైతు కోలుకోలేక ఆదివారు మృతి చెందాడు. వివరాల మేరకు.. వెల్దుర్తి మండలం కొసనపల్లి గ్రామానికి చెందిన కురువ రామచంద్రుడు (35) 1.5 ఎకరాల్లో ఉలి సాగుచేశాడు. దిగుబడి రావడంతో నాలుగు రోజుల క్రితం కోశారు. అయితే ధరలు పడిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. గతేడాది మిరప సాగుచేసి తీవ్రంగా నష్టపోయాడు. ఏ ఏడాది ఉల్లి కూడా నష్టం చేయడంతో అప్పుల వారి నుంచి ఒత్తిడి తట్టుకోలేక తీవ్ర వేదనకు గురై ఈ నెల 11వ తేదీన పొలంలో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. ఆదివారం కోలుకోలేక మృతిచెందాడు. భార్య శివలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

ఆస్పరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.50వేల పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు బాలకృష్ణ, రంగస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఉల్లి, టమోటకు మద్దతు ధర చెల్లించాలని కోరారు. ఈనెల 20న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని రైతులు విజయవంతం చేయాలన్నారు. మసాల రవి, శేఖర్, ఈరన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నష్ట పరిహారమివ్వాలి

మద్దికెర సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ నాయకులు నాగరాజు, మదనంతపురం హనుమన్న, పెరవలి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ ఈ ఏడాది భారీ వర్షాలు కురియడంతో కంది, టమోటా, వేరుశనగ, ఇతర పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోండి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర ఆటో ఫెడరేషన్ సభ్యుడు రఫీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం పత్తికొండలో ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ మహాసభ నిర్వహించారు. ప్రభాకర్, వెంకటేశ్వర రెడ్డి, కాశీ ఉన్నారు.

వంతెనను నిర్మించాలి

మద్దికెర సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురుజుల గ్రామ శివారులో సుద్దబాయి వంక, పెద్దహుల్తి వంకపై వంతెనను నిర్మించాలని టీడీపీ నాయకులు చెన్నకేశవులు, కొత్తూరు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం చిన్న వర్షం వచ్చినా వంకలు పొర్లుతాయని ఎమ్మెల్యే శ్యాంబాబు దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

ఉత్తమ రైతుగా మల్లికార్జున

దేవనకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున ఉత్తమ రైతుగా ఎంపికయ్యారు ఆదివారం హైదరాబాద్ నగరం హరిత హోటల్‌లో రెండు తెలుగు రాష్ట్రాల రైతులను సీబీఐ మాజీ జెడీ లక్ష్మీనారాయణ, సినీ సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్, మాజీ ఎమ్మెల్యేలు బక్కన నరసింహులు, ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జ్ఞాపిక అందజేసి సన్మానించారు. తెలుగు రాష్ట్రాల పరిధిలో 30 మందిని ఎంపిక చేయగా కప్పట్రాళ్ల గ్రామానికి కుడా చోటు దక్కడం ఆనందంగా ఉందని మల్లికార్జున తెలిపారు. దత్తత పుత్రుడు ఆకే రవికృష్ణ ప్రోత్సాహంతో సేట్రిస్ సంస్థ ద్వారా 30 ఎకరకాల్లో బత్తాయిని సాగు చేస్తున్నట్లు రైతు మల్లికార్జున తెలిపారు.



మల్లికార్జునను సన్మానిస్తున్న సీబీఐ మాజీ జేడీ

తాగి నడిపిన వారిపై కేసు

ఆలూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 34 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు. ఆదివారం వాహనదారులకు డంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మహబూబ్‌బాషా

సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సమస్యలను పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్కే చిన్నప్ప డిమాండ్ చేశారు. ఆదివారం నేషనల్ ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కొన్ని పాఠశాలలు ప్రభుత్వ విద్యాశాఖలోకి విలీనమైనా సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయన్నారు. పెండింగ్‌ల డీఏ బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ ప్రకటించాలన్నారు. అనంతరం ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ ఇటీవల పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు

ఉత్తమ పార్లమెంటేరియన్ సురవరం



మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మండల కార్యదర్శి కారుమంచి అధ్యక్షతన నిర్వహించారు. కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి, సీపీఎం నాయకులు రంగారెడ్డి, వైసీపీ, కన్వీనర్లు నాగరాజు, సుధాకర్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు పాల్గొన్నారు. సుధాకర్‌రెడ్డి కర్నూలు జిల్లాలోనే పోరాటానికి నాయకత్వం వహించి అంచలంచెలుగా సీపీఐ జాతీయ నాయకుడిగా ఎదిగారన్నారు.

బకాయిలను చెల్లించాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆర్‌టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో కమిటీ ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి నరసయ్య టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు హాజరయ్యారు. 11వ పీఆర్‌సీ 24 నెలల బకాయిలు, డీఏ అరియర్స్ చెల్లించకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం తగదన్నారు. వెంటనే 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, పదవీవిరమణ పొందిన, మరణించిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఆర్‌టీసీ విలీనానికి ముందుకు రిటైర్డ్ ఎంప్లాయిస్ మెంబర్ స్కీమ్ నుంచి నిలిపివేసిన వైద్య సేవలను పునరుద్ధరించాలన్నారు. టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు 43% ఫిట్‌మెంట్, అనంతరం 25% ఇచ్చారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉద్యోగులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ఎంయూ వైఎస్సార్ యూనియన్ నుంచి 30 మంది సభ్యులు ఈయూలో చేరారు. యూనియన్ నాయకులు మద్దిలేటి, కేకే కుమార్, రంగస్వామి, ఏవీ రెడ్డి, సీపీఐ కార్యదర్శి వీరేష్, ఓబీ నాగరాజు, డిపో అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, ఉలిగన్న, చంద్రబాషా, ఎస్‌వి కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్ రావు

ఓ వజ్రం దొరక్కపోదా!

● వర్షం కురవడంతో తుగ్గలి మండలంలో ప్రారంభమైన వజ్రాన్వేషణ



జొన్నగిరి పొలంలో వజ్రాన్వేషకులు

తుగ్గలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిసిన వెంటనే వజ్రాన్వేషకులు పొలాల్లో వాలిపోతున్నారు. ఆదివారం మండలంలోని జొన్నగిరి, ఉప్పర్లపల్లి, తదితర గ్రామాలకు వజ్రాన్వేషకులు తరలివచ్చారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు వజ్రాలు లభిస్తాయని వచ్చామని అన్వేషకులు తెలిపారు. గుంటూరు, నంద్యాల, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి వాహనాల్లో వచ్చి వజ్రాలు అన్వేషిస్తున్నారు.





ఉత్తమ 'ప్రైవేటు' ఉపాధ్యాయుడిగా సుధాకర్

దేవనకొండ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయుడిగా దేవనకొండ జ్ఞానసుధా పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ ఎంపికయ్యారు. ఆదివారం తిరుపతిలో ఏపీపీయూ, ఎస్ఎంఏ ఆధ్వర్యంలో రాయలసీమ పరిధిలోని 8 జిల్లాల ప్రైవేటు పాఠశాలల సమావేశం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సుధాకర్‌ను ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి సన్మానించారు.



సుధాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

విశ్వకర్మ యజ్ఞోత్సవానికి తరలి రావాలి

ఆదోని టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 17న అమరావతి రాజధాని ప్రాంగణంలో నిర్వహించనున్న 'సృష్టి విశ్వకర్మ జయంతి యజ్ఞోత్సవం' తరలిరావాలని బీజేపీ నాయకుడు విట్టా రమేష్ అయ్యన్న అచారి పిలుపునిచ్చారు. ఆదివారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, యువ మోర్చా మాజీ కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, అర్చన్ అధ్యక్షుడు నాగరాజ్, ఓబీసీ నాయకుడు వడ్డే శ్రీనివాస్ ఉన్నారు.



కర పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పొదుపు సంఘాలను బలోపేతం చేస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● వెలుగు ఏపీఎం రామాంజనేయులు



మద్దికెర సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను బలోపేతం చేస్తామని ఏపీఎం రామాంజనేయులు అన్నారు.

ప్రశ్న: మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి?

జవాబు: మద్దికెర మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో పొదుపు సంఘాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: మండలంలో పొదుపు సంఘాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: మండలంలో 790 పొదుపు సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న: స్త్రీనిధి కింద ఎంత రుణాలు ఇచ్చారు?

జవాబు: మండలంలోని పొదుపు మహిళలకు స్త్రీనిధి కింద దాదాపు రూ.4.50కోట్ల వరకు రుణాలు ఇచ్చాము.

ప్రశ్న: గ్రామైఖ్య సంఘానికి పీఐఎఫ్ కింద ఎంత రుణం ఇచ్చారు?

జవాబు: మండలంలో మొత్తం 22 గ్రామైఖ్య సంఘాలు ఉండగా, రూ.కోటి వరకు రుణాలు ఇచ్చాం.

ప్రశ్న: ఎస్సీ, ఎస్టీ, ఐడబ్ల్యూ ఎంపీ కింద ఎంత మందికి రుణాలు ఇచ్చారు..?

జవాబు: మండలంలోని ఎస్సీ ఎస్టీ మహిళలకు రూ.80 లక్షల వరకు రుణాలు ఇచ్చాం.

ప్రశ్న: మండలంలోని 790 పొదుపు సంఘాలకు అంతర్గత రుణాలు ఇచ్చారా?

జవాబు: పొదుపు సంఘాల మహిళలకు అంతర్గత, వ్యక్తిగత రుణాలు రూ.16 కోట్లు ఇచ్చాం.

ప్రశ్న: పొదుపు సంఘాలు ఎలా పని చేస్తున్నాయి?

జవాబు: మండలంలో పొదుపు సంఘాలన్నీ సక్రమంగా పని చేస్తున్నాయి. రుణాలు రికవరీ కూడా బాగా ఉంది.

ప్రశ్న: బీమా సఖి ఎవరు ఎంపిక చేస్తారు?

జవాబు: మండలంలో మొత్తం 22 మంది విలేజ్ బుక్ కీపర్లు ఉన్నారు. వీరే భీమా సఖికి మహిళలను ఎంపిక చేస్తున్నారు.

పత్తి క్రయ విక్రయాలు ఎప్పుడో?

● ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఆరేళ్ల నుంచి నిలిచిపోయిన వైనం
● పట్టించుకోని అధికారులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనేగండ్ల, మంత్రాలయంతో పాటు పెద్దకడుబూరు, కోసిగి, బెళగళ్ మండలాల్లో రైతులు పత్తిపంటను ప్రతి ఏడాది విస్తారంగా సాగుచేస్తారు. దీంతో పంట దిగుబడి పెద్దఎత్తున్న వస్తోంది. రైతులు పండించిన పత్తిని విక్రయించేందుకు ఆదోని, రాయచూరులకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో రైతుల వ్యయప్రయాసలను తగ్గించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలు నిర్వహించేందుకు 2016లో విక్రయాలను ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతంలోని పత్తిరైతులు సంతోషించారు. ఇతర ప్రాంతాలకు వ్యయప్రయాసలు పడి వెళ్లకుండా రైతుల సౌలభ్యం కోసం ఇక్కడే పత్తిని అమ్ముకోవచ్చని సంతోషపడ్డారు. అయితే వారి సంతోషం ఎంతో కాలం నిలువలేదు. అధికారుల నిర్లక్ష్యంతో పత్తి విక్రయాలు కాస్త అనతికాలంలోనే నిలిచిపోయాయి. దీంతో రైతులకు ఎప్పటి కష్టాలు తప్పటం లేదు. పత్తిని అమ్ముకునేందుకు ఆదోని, రాయచూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడికి వెళ్లలేని వారు పట్టణంలోనే ప్రైవేటు జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో, ప్రైవేటు దుకాణాలలో వారి అడిగిన ధరకు అమ్ముకుంటున్నారు. దీంతో ఫ్యాక్టరీలు, దుకాణాలు కళకళలాడుతుండగా మార్కెట్‌లో పత్తివిక్రయాలు లేక వెల వెలబోతోంది.

ఆరేళ్లుగా నిలిచిన పత్తి క్రయవిక్రయాలు: వ్యవసాయ మార్కెట్ కమిటీలో పత్తిక్రయవిక్రయాలు ఆరేళ్లుగా నిలిచిపోయాయి. పత్తికొనుగోళ్లు నిలిచి పోవటంతో రైతులు ఇతరప్రాంతాలకు, జిన్నింగ్ ఫ్యాక్టరీలకు, బహిరంగ మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు తరలిస్తున్నారు. మార్కెట్‌లో దాదాపు 40మంది కమీషన్ ఏజెంట్లు పత్తికొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా దుకాణాలను అప్పట్లో ఏర్పాటుచేసుకున్నారు. రైతులనుంచి వారు కొన్న పత్తిని ఇతరప్రాంతాలకు తరలించి లబ్దిపొందేవారు. పత్తివిక్రయాలు నిలిచిపోవటంతో కమీషన్ ఏజెంట్లు చేసేదిలేక వ్యాపారాన్ని చాలించుకున్నారు. కొంతమంది ఆదోని మార్కెట్‌కు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. అంతేగాక ఈదుకాణాల్లో పనిచేసే సిబ్బంది, హమాలీలలకు ఉపాధిలేకుండా పోయింది. దీంతో ఈ దుకాణాలు కాస్త నేడు హోల్ సేల్ కూరగాయల దుకాణాలుగా మారిపోయాయి. పత్తి క్రయవిక్రయాలు నిలిచి పోవటానికి స్థానికంగా ఉన్న వ్యాపారులు, జిన్నింగ్ ఫ్యాక్టరీల నిర్వాహకులు టెండర్లలో తక్కువ ధరలు కోడ్ చేయటం, రైతులకు నగదు చెల్లింపులు చేయటం వంటి వాటితో ఈ ఫ్యాక్టరీల ముందు రోజు ఉదయం పదుల సంఖ్యలో వాహనాలు పత్తి లోడ్‌తో బారులు తీరుతున్నాయి. అంతేగాక బయట వ్యాపార దుకాణాల్లో రైతులు తెచ్చే పత్తిని అధికధరలకు ఆశచూపి కొనుగోలు చేస్తున్నారు. వీరు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలియని రైతులు అధిక ధరకు కొనుగోలు చేస్తారని, నగదు చెల్లిస్తారని ఆశతో పత్తిని అమ్ముకుంటున్నారు.


పత్తి అమ్మకాల కోసం ఏర్పాటు చేసిన షాపుల్లో కూరగాయల హోల్‌సెల్ దుకాణాలు


మంత్రాలయం రోడ్డులో ఉన్న ఓ జిన్నింగ్ ఫ్యాక్టరీ దగ్గర పత్తి లోడుతో భారీగా నిలిచిన వాహనాలు

● **1.20లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు:** ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న 1.50లక్షల ఎకరాల్లో దాదాపు 1.20లక్షల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది పత్తిపంటను సాగుచేశారు. ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఈ ఏడాది వాతావరణం అంతంత మాత్రంగానే ఉండటంతో ప్రస్తుం 10నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈలెక్కన దాదాపు పదిలక్షలకు పైగా క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇందులో 60శాతానికి పైగా ఇతర ప్రాంతాలకు వెళ్లటం, మిగతా దిగుబడి స్థానిక వ్యాపారులు, ఫ్యాక్టరీలకు తరలుతూ వస్తోంది. ఈ దిగుబడి అంత ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరిగితే ఏ మేరకు సెస్సు రూపంలో ఆదాయం వస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసం ఎంతైనా ఉంది.

● **వ్యయ ప్రయాసలు పడుతున్న రైతులు**

ఎమ్మిగనూరు మార్కెట్‌లో పత్తిఅమ్మకాలు నిలిచిపోవటంతో పత్తిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో కష్టపడి పండించిన పత్తిపంటను ఆదోని, రాయచూరుతో పాటు ఇతరప్రాంతాలకు తరలించేందుకు ఖర్చు తడిసి మోపడవుతోంది. అంతేగా అక్కడ ఏ ధర అడుగుతారో, అమ్ముడు పోతుందో లేదో తెలియక ఆందోళనకు గురువుతున్నారు. అదే స్థానికంగా అయితే ధర రానిపక్షంలో మార్కెట్‌లోనే నిలువ చేసుకొని ధరవచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉండేది.

త్వరలో పత్తి విక్రయాలు



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ పత్తి క్రయవిక్రయాలను త్వరలో పారంభిస్తాం. పత్తి క్రయవిక్రయాలు జరిగే ప్రదేశంలో కరోనా సమయం నుంచి కూరగాయల వ్యాపారం జరుగుతోంది. ఆ వ్యాపారులకు వేరో చోట స్థలం చూపించి, దుకాణాలు ఏర్పాటు చేస్తాం. రైతు బజారు కూడా ఏర్పాటు చేస్తాం. అటు తరువా పత్తి క్రయవిక్రయాలు జరిగేందుకు చర్యలు తీసుకుంటాము.

- బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే

ఎమ్మెల్యేతో చర్చించి పత్తి విక్రయాలపై నిర్ణయం



ఒకటి రెండు రోజుల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి మార్కెట్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ట్రేడర్లు, బయ్యర్లు, వ్యాపారులతో సమావేశం నిర్వహిం చనున్నారు. ఈ సందర్భంగా పత్తి క్రయవిక్రయాలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. పత్తి విక్రయాలు జరిగే చోట ప్రస్తుతం కూరగాయల హోల్ సేల్ దుకాణాలు ఉన్నాయి. వారికి వేరోకచోట స్థలం కేటాయించాల్సి ఉంది. దాన్ని ఎమ్మెల్యే పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. అటు తరువాత పత్తి విక్రయాలపై నిర్ణయం ఉంటుంది.

- చంద్రమౌళి, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ

టీడీపీ మండల కార్యదర్శులకు సన్మానం


టీడీపీ మండల కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

నందవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కార్యదర్శులను మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నదికైరవాడి వీరేష్ ఆద్వర్యంలో సన్మానించారు. టీడీపీ మండల కార్యదర్శులుగా ముగతి బార్గవ్‌యాదవ్, ఇబ్రహింపురం శంకరమ్మ, పల్లె వెంకటప్ప, గురుజాల చార్లేష్ లను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అధికారికంగా ప్రకటించడంతో వారికి సన్మానం చేశారు. ఆదిశేషు, త్యారెడ్డి, సుదీర్, కిషోర్, సోమన్న పాల్గొన్నారు.

ప్రజా బాంధవుడు ఏచూరి

కౌతాళం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రజా భాందవుడు అని సీపీఎం నాయకులు కొనియాడారు. ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య పార్టీ నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ఉలిగప్ప, వీరేష్, శంకర్, సత్తి ఉన్నారు.

మద్యానికి అనుమతిస్తే కఠిన చర్యలు

మంత్రాలయం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, చెట్నహళ్లి, కల్లుదేవకుంట తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న హోటల్‌లో మద్యం తాగనిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివాంజల్ హెచ్చరించారు. మద్యం తాగనిస్తున్నారనీ పిర్యాదులు రావడంతో ఆదివారం రాత్రి హోటళ్లను తనిఖీ చేశారు. అదే విధంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి అపరాధ రుసుం విధించారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు'

నందవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఏపీ బీసీ కో- ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడు, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప అన్నారు. ఆదివారం వారు మాట్లడుతూ ప్రభుత్వం ఉచితంగా గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటివి ఇచ్చిన హామీలన్నీ దశల వారిగా నెరవేరుస్తుంటే వైసీపీకి మింగుడుపడడం లేదన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో, పట్టణాల్లో పిడికెడు మట్టి వేయలేదన్నారు. వచ్చిన నిదులన్నీ దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

కోసిగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు వివిధ పంటలకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన కోసిగిలోని విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పత్తి పంట నీటి ముంపునకు గురైనసమయంలో ఆకులు ఎర్రబడటం, మొక్కలు వాడటం, కాయలు కుల్లిపోవడం జరుగుతుందని, నీటి ముప్పు పరిస్థితి ఉన్న సమయంలో పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ప్రతి లీటరు నీటికి నానో యూరియా 2 నుంచి 4 మిల్లిలీటరు నీటికి కలిపి పంటకు పిచికారీ చేయాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సురేష్‌బాబును సన్మానిస్తున్న నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం కర్నూలు జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రాలయం నియోజకవర్గం నాలుగు మండలాల నాయకులు ఏసేబు, రామాంజనేయులు, గణేష్ కలిసి పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు స్థానిక సంస్థల ఎన్నికల పోటీల్లో సీట్లు ఖరారు, మండల గ్రామస్థాయి కమిటీల ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. రాంబాబు, మహ్మద్, రామాంజి, సాయిబన్న, సలాంబాషా, సుబాన్, వెంకటేష్, అబ్దుల్, రాము, అంజి పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కౌతాళం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రోడ్లు గుంతమయంగా ఉండటంతో ఏక్షణాన ఏప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా మండల పరిధిలోని గోతులదొడ్డి-కుంబళనూరు క్యాంపు మధ్య ఉన్న నల్ల వంక మధ్య ఉన్న కల్వర్టు వర్షకాలం మొదట్లోనే కల్వర్టు దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోగా తాత్కాలికంగా వాహనాల రాకపోకల కోసం గ్రావెల్‌ను వేసి మరమ్మతులు చేపట్టారు. ఆదివారం కుంబళనూరు క్యాంపు నుంచి కర్నూలుకు వరి వ్యాపారస్థులు వరి సంచుల లారిలో తీసుకువెళుతుండగా శనివారం కురిసిన భారీ వర్షానికి కల్వర్టుకు చేపట్టిన తాత్కాలిక మార్గం గుండా వెళుతూ అదుపుతప్పి బోల్తా పడినది. ఆ సమయంలో లారీలో ఏవరు లేకపోవడంతో పాణ నష్టం జరగలేదు.

నిరుపయోగంగా చేతిపంపు


మేకడోనలో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు

పెద్దకడబూరు , సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోన గ్రామంలో చేతిపంపు నిరుపయోగంగా మారింది. గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం చేతిపంపుల నిర్వహణను గాలికొదిలేసారు. ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారం కోసం నిధులు వెచ్చిస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలోని చేతిపంపులకు మరమ్మతులు చేయించి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదోనిలో అనసూయ సందడి

ఆదోనిలో జీవీ మాల్ ప్రారంభం


మాల్‌లో చీరను ప్రదర్శిస్తున్న అనసూయ


జీవీమాల్‌లో శారీని పరిశీలిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఆదోని, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్పరి రోడ్డులో జీవీ మాల్ వస్త్ర దుకాణాన్ని టీవీ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ ఆదివారం ప్రారంభించారు. అనసూయ రానున్నారని తెలిసిన ప్రజలు, యువత పెద్దఎత్తును జీవీ మాల్ వదకు చేరుకున్నారు. అనసూయ మాల్ దగ్గరకు చేరుకుని 'హాయ్ ఆదోని' అంటూ పలకరించారు. అనంతరం జీవీ మాల్ నిర్వాహకుడు, ఎండీ ఉమామహేశ్వర్‌రావు, గుర్రం వాసు, రేవంత్, అంకిత్‌తో కలిసి అనసూయ రిబ్బన్ కట్‌చేసి షోరూంను ప్రారంభించారు. అనసూయతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పోటీ పడ్డారు. అనంతరం అనసూయ విలేకరులతో మాట్లాడుతూ మాల్ స్థానికుల అభివృద్ధికి దోహదపడాలని కోరుకుంటున్నానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మాల్ ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ఇది పునాది అన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ నాయకులు, కురువ సంఘం జిల్లా అద్యక్షుడు మల్లికార్జున, చాగి మల్లికార్జునరెడ్డి, బుద్ధారెడ్డి పాల్గొన్నారు. సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

కారుమబ్బుల వలయంలో కోసిగి


కోసిగిలోని బసవన్నకొండపై కారుమబ్బులు

కోసిగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కారుమబ్బులు కమ్ముకోవడంతో కోసిగి పట్టణం కారుమబ్బులతో చీకటిమయంగా మారింది. కోసిగిలోని తిమ్మప్ప, బసవన్న, రంగప్ప కొండలపై నీలిమబ్బులు కిందకు దిగివచ్చి చేతులకు తగులుకున్నంత ఎత్తులో ఉండటంతో కోసిగిలో ఆసక్తిగా ప్రజలు కారుమబ్బులను తిలకించారు. కోసిగిలో గత మూడు రోజుల నుంచి వర్షాలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోసిగిలో కారుమబ్బులు ఆదివారం కప్పేయడంతో రైతులు, ప్రజలు వర్షానికి భయపడుతున్నారు. వర్షాలు ఇలాగే చేతికొచ్చిన పంటలు కుల్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛర ణలు మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు విద్యుత్ కాంతుల మధ్య స్వర్ణరథంపై శోభిల్లారు. ఆదివారం భాద్రపద సప్తమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో బంగారు రథానికి హారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.

టీడీపీ మండల కమిటీ ఎంపిక

గోనెగండ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల టీడీపీ కార్యవర్గాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రకటించారు. కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల టీడీపీ కన్వీనర్‌గా తిరుపతయ్యనాయుడు(గోనెగండ్ల) ఎన్నికయ్యారు. అలాగే మండల ఉపాధక్ష్యుడిగా నాగన్న (పెద్దనేలటూరు), ప్రధాన కార్యదర్శిగా రమణ(కున్నూరు), మండల ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జిలానిభాషా (గోనెగండ్ల), రాజేష్‌నాయుడు (హెచ్ కైరవాడి), కురువ జయపాల్ (పిల్లిగుండ్ల), మండల కార్యదర్శులుగా జుట్లలింగన్న(బైలుప్పల), శివన్న(ఒంటెడుదిన్నె), వెంకటేష్ (గంజహళ్లి), మండల కోశాధికారిగా సయ్యద్ శాలుబీ (అలువాల) లను ఎన్నికయ్యారు. త్వరలో అనుబంధ సంస్థల కమిటీలను కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారు అన్నారు.

సమస్యలను ఎత్తి చూపడం తప్పా?: వైసీపీ


మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి విరుపాక్షి రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పడుతున్న సమస్యలను ఎత్తి చూపడం తప్పా? అని వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి విరుపాక్షి రెడ్డి, జిల్లా ప్రతినిధి సునీల్, పట్టణ అధ్యక్షుడు నాగేషప్ప, మధుబాబు, చేనేత మల్లిలు అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదిన ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు పడుతున్న ఆ సమస్యలను వైసీపీ ఇంచార్జి బుట్టా రేణక ఎత్తి చూపితే దీని గురించి 'అవగాహన లేదని, తెలుసుకొని మాట్లాడాలి' అనడం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి తగదు అన్నారు. బుట్టా రేణుక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న సూపరిండెంట్‌తో హస్పిటల్‌లో ఉన్న మౌలిక వసతులు, సిబ్బంది కొరత గురించి తెలుసుకొని మాట్లాడిందని అన్నారు. 2003లో సంవత్సరంలో శంకుస్థాపన చేసి, 2019లో మరోసారి శిలాఫలకాలన్ని ఏర్పాటు చేసి వదిలేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. బజారి, కొటకొండ నరసింహులు, పాల శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధితులకు ఆపన్న హస్తం

కౌతాళం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన కౌతాళంలో శనివారం సాయంత్రం కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఆదివారం దాతలు అపన్న హస్తం అందజేసి మానవత్వం చాటుకున్నారు. రవి కిరణ్ ఫర్టిలైజర్ దుకాణ యాజమాని నవీన్ రెడ్డి తన వంతు సహయంగా ముందుకు వచ్చి ఏడు కుటుంబాలకు సుమారు రూ.వెయ్యి విలువ చేసే కిరణ వస్తువులు, కాయకూరల కిట్‌లను ఉచితంగా అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో యువకులు గోవిందు, గురు, గోపాల్ ఉన్నారు.

సీఐ కౌన్సెలింగ్

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని నేర ప్రవర్తన కలిగిన వ్యక్తులను పిలిచి ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి, కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ నేర ప్రవర్తన కలిగిన రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నేరప్రవృత్తి మానుకోవాలని సూచించారు పట్టణ ప్రజలకు, వారి నుంచి ఎటువంటి హాని జరగకుండా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కిష్టప్ప, రఘు, మద్దిలేటి పాల్గొన్నారు.

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ప్రజా సమస్యల వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే సోమవారం పాత తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేధికలో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా రైతులు రీ సర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

మంత్రాలయం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కురువ బసవరాజప్ప (60) మృతికి నాయకులు సంతాపం తెలిపారు. ఆదివారం టీడీపీ నాయకులు కురువ బసవరాజప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు బసవరాజప్ప మృతదేహానికి నివాళులర్పించారు. పార్టీకి తీరని లోటు అని టీడీపీ మండల నాయకులు మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నగేష్, మేకల మల్లేష్ అన్నారు. టీడీపీ నాయకులు పెద్దలక్ష్మయ్య, డీలర్ గోపాల్, తిమ్మరాజు, వెంకట్రాముడు, నాగరాజు, నాగేంద్ర, నల్లన్న పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని వాలీబాల్ అసోషియేషన్ సభ్యులు బాబాఖాన్ అన్నారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎన్నికైన దోర్నాల శీను, ఉమ్మడి కర్నూలు జిల్లా అండర్ 19 ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరిగా ఎన్నికైన రాఘవేంద్రలను వాలీబాల్ ఆసోషియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. విక్రమ్, సూరజ్, గోవింద్, శంకరన్న,గౌడ్, వెస్లీసునీల్, రాజేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

జీడీపీ వద్ద సందర్శకుల సందడి


జీడీపీ నుంచి హంద్రీకి విడుదలవుతున్న నీరు


నీటిలో సందడి చేస్తున్న మహిళలు, పిల్లలు, యువకులు

గోనెగండ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రెండుమూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారాణంగా గాజుల దిన్నె ప్రాజెక్టుకు మూడు రోజుల నుంచి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల వరదనీరు చేరింది. ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు కావడంతో శుక్రవారం రాత్రి నుంచి జీడీపీ ఇరిగేషన్ డీఈ సుబ్బరాయుడు, ఏఈ మహమ్మద్‌ఆలీ గేట్లను ఎత్తి నీటిని దిగువ హంద్రీనదికి విడుదల చేశారు. ఆదివారం 3,4 గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని హంద్రీకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాలనుంచి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

జీడీపీకి సందర్శకుల తాకిడి: గాజులదిన్నె ప్రాజెక్టు కు సందర్శకుల తాకిడి పెరిగింది. గత మూడు రోజుల నుంచి ప్రాజెక్టు గేట్లు ఎత్తి ఆధికారులు హంద్రీనదికి నీటి విడుదల చేస్తున్నారు. నీటి విడుదలను చూసేందుకు సందర్శకులు వస్తున్నారు. ఆదివారం కూడా 3,4 గేట్లను ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం అందులోను ఆదివారం సెలవు దినం కావడంతో కోడుమూరు, కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని బెళగల్, గూడురు తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు, యువకులు, పిల్లలు, విద్యార్థులు అధికసంఖ్యలు ప్రాజెక్టు వచ్చి నీటిలో స్నానాలు చేస్తు ఆనందాన్ని పొందుతుతున్నారు. అలాగే గోనెగండ్ల మండల చుట్ట పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు గాజులదిన్నె ప్రాజెక్టును చేరి నీరు విడుదలను చూశారు. సందర్శకులు నీరు ఎగిసి పడటంను చూసి ఆనందంతో కేరితంలు కొట్టారు. నీటి విడుదల అయినంత వరకు మహిళలు, యువకులు, పిల్లల సందర్శకుల తాకిటి గత మూడు రోజులుగా కొనసాగింది.